జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 22-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 79 పేజీలు: 8 వెల: రూ.7

* ప్రజల దెబ్బకు ఇళ్లకే పరిమితమైన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు
* బోసిపోయిన క్యాంపు కార్యాలయాలు, పార్టీ ఆఫీసులు
* పార్టీ శ్రేణులకు ముఖం చూపని కొందరు నేతలు
* పార్టీ కార్యక్రమాలకు సైతం రాని ధర్మాన ప్రసాదరావు
* కృష్ణదాస్, అప్పలరాజు మినహా మిగతా వారంతా మౌనం
* డీలా పడుతున్న వైసీపీ కార్యకర్తలు



# మాజీలు.. మౌనం



**శ్రీకాకుళం, జులై 21 (వార్త):** సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేలకు ఊహించని విధంగా ప్రజలు దెబ్బకొట్టారు. గెలుస్తామన్న స్థానాల్లో కూడా ప్రత్యర్థులు పెద్ద మెజార్టీతో విజయం సాధించడంతో మాజీలైన వైసీపీ ఎమ్మెల్యేలు షాక్‌కు గురయ్యారు. రాజకీయాల పట్ల వైరాగ్యం వచ్చినట్టు కేవలం ఇంటికే పరిమితమయ్యారు. పార్టీ కార్యాలయాలకు కూడా రావడం మానేశారు. కార్యకర్తల మాటెరుగు.. జనం ముఖం చూడడానికి సైతం బయటకు రావడం లేదు. గతంలో నిత్యం ప్రెస్‌మీట్లకు, ప్రెస్‌నోట్లను విడుదల చేసే వారు సైతం ప్రస్తుతం మౌనం వహిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు సైతం ఏదో వచ్చాం.. చేశాం.. అన్న మాదిరిగానే వచ్చిపోతున్నారు. పార్టీ కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు బోసిపోతున్నాయి. ఒకప్పుడు కళకళలాడే కార్యాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కావడం వల్లేనేమో ధర్మాన కృష్ణదాస్ మాత్రం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కార్యకర్తలకు అండగా ఉంటున్నారు. మిగతా మాజీలు ఎక్కడున్నారో? ఏం చేస్తున్నారో? అసలు నియోజకవర్గంలో ఉన్నారో లేదో? ఆ పార్టీ శ్రేణులకే తెలియడం లేదు. ఏకంగా పలాసలో అయితే వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్‌పై ఓ టీడీపీ నేత గొంతు పట్టుకుని గెంటేశాడు. మందస మండలంలోని హరిపురంలో వైసీపీ సానుభూతిపరుడికి చెందిన ఓ షాపును కొందరు అగంతకులు దహనం చేశారు. రణస్థలం మండలం నారువలో ఓ వైసీపీ నేతకు చెందిన కారును తగులబెట్టారు. ఇక సంతబొమ్మాళిలో మాజీ ఎంపీటీసీ కొన్న శ్రీరాములు చెందిన సోలార్ ప్లేట్లను ధ్వంసం చేశారు. సంతబొమ్మాళి మండలంలోని నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన 17 మంది వైసీపీ సానుభూతిపరులు మూలపేట పోర్టులో పనిచేస్తుండగా, వారిని తొలగించేశారు. వారికి అండగా ఉండాల్సిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కనీసం నోరెత్తడం లేదు. కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. దీంతో కార్యకర్తలు ఇంతకాలం మేం వీరి కోసమా పనిచేశాం.. అంటూ ఆవేదనకు గురవుతున్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు జాడే లేదు. ఇటీవల వైఎస్ఆర్ జయంతి వేడుకలకు ఆయన హాజరుకాలేదు. రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, తమ్మినేని సీతారాం, పిరియా విజయ, నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్ ఇలా ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన వారంతా ప్రస్తుతం ముభావంగానే ఉన్నారు. కనీసం పార్టీ శ్రేణులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారిలో మనోధైర్యం నింపే ఒక్క కార్యక్రమం కూడా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలే అవుతున్నందున మరికొద్ది నెలలు వేచిచూసి అప్పుడు క్షేత్రస్థాయికి వస్తారని వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు చెబుతున్నారు. వారు వచ్చేలోగా వైసీపీ శ్రేణులు టీడీపీ, జనసేన, బీజేపీలోకి జారుకునే అవకాశం కూడా లేకపోలేదన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

# ఎర్రన్న విద్యా సంకల్పం.. విజయవంతం

* రెండో ఏడాది పరీక్షకు 650 మంది హాజరు * శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో పరీక్షల నిర్వహణ




**శ్రీకాకుళం, జూలై 21 (వార్త):** ప్రతిభావంతులైన నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు శ్రీకారం చుట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమం వరుసగా రెండో ఏడాది విజయవంతమైంది. ప్రతిభ చూపిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందజేయాలని నిర్ణయించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 650 మంది హాజరయ్యారు. శ్రీకాకుళంలోని విద్యాధరి డిగ్రీ కళాశాల, పలాసలోని మదర్ థెరిసా పాఠశాల, టెక్కలి విశ్వ జ్యోతి డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్ష ద్వారా ప్రతిబి కనబరిచిన అభ్యర్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు తన తండ్రి ఎర్రన్న కృషి చేశారని.. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేలా తమ వంతు సహాయం అందించాలని ఈ కార్యక్రమానికి సంకల్పించామని, విద్యావ్యవస్థలో అత్యంత అనుభవం కలిగిన వారితో ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్ష ప్రణాళిక రూపొందించామని వివరించారు. గత ఏడాది కోటబొమ్మాళిలో జూన్ 10న దీనిని ప్రారంభించామని, డీఎస్సీ, గ్రూప్-1, 2, పోలీసు నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఈ టాలెంట్ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## పురుషోత్తంరావు కుటుంబానికి జనసేన సాయం

**పోలాకి, జులై21 (వార్త):** బెలమర పంచాయతీకి జనసేన క్రియాశీలక సభ్యుడు మద్దు పురుషోత్తంరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబ సభ్యులు మద్దు రాజేశ్వరి, మద్దు ఉపేంద్రలకు 5 లక్షల చెక్కును మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అందజేవారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బలగ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



# రోడ్డా.. చెరువా?

* గోతుల్లో నిలిచిపోతున్న వర్షం నీరు
* ప్రమాదాల బారిన వాహనచోదకులు
* పట్టించుకోని పాలకులు

**సోంపేట, జులై 21 (వార్త):**సోంపేట పట్టణంలోని రాజుగారి పేటకు వెళ్లే రహదారి చెరువును తలపిస్తోంది. వర్షం పడితే చాలు రోడ్డుపై నీరు మోకాళ్ల లోతులో నిలిచిపోతోంది. ఈ రోడ్డు మీదుగా సోంపేట పట్టణవాసులే కాకుండా కవిటి మండలవాసులు రాకపోకలు చేస్తుంటారు. ఎక్కడికక్కడ గోతులు పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు విషయమై స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ రహదారి మీదుగానే ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి ఉంది. నేత్ర వైద్యం కోసం వెళ్లేవారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పంచాయతీ స్థలం ఆక్రమణకు గురికావడంతో మురుగునీరు దిగువకు వెళ్లడం లేదు. గర్ల్స్ హై స్కూల్ పక్కన ఉన్న కాలువకు ఈ మురుగునీరు మళ్లిస్తే తాత్కాలికంగా ఈ సమస్యలు పరిష్కారం చూపవచ్చని పలువురు చెబుతున్నారు.

# చిల్లర రాజకీయాలు వద్దు

**మందస, జులై 21 (వార్త):** తెలుగుదేశం పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మందస మండలంలోని బహడపల్లిలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు అభివృద్ధికి సహకరిస్తే బాగుంటుందన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు మాట్లాడడం అవివేకమన్నారు. గ్రామంలో తనకు రెండు ఇళ్లు ఉన్నాయని, రెండు విద్యుత్ మీటర్లు కూడా ఉన్నాయన్నారు. గ్రామంలో ఎవరైనా ఇల్లు కట్టుకుంటే ఆ ఇంటిని తాత్కాలికంగా వాడుకుంటున్నారని చెప్పారు. దానికి సంబంధించిన విద్యుత్ మీటరు కాలిపోయిందన్నారు. ఇటీవల విద్యుత్తు విజిలెన్స్ అధికారులు దాడి చేసిన సమయంలో మీటరు కాలిపోయిందని వారి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. తనతోపాటు మాజీ మంత్రి పీఏ జోగ కృష్ణారావు, బహడపల్లి సర్పంచ్ ప్రతినిధి బోద్దు ఉమాపతి జీడి పరిశ్రమలను కూడా విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారన్నారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వెనుదిరిగారన్నారు. నిజాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు మాట్లాడటం వారి విజ్ఞతకే విడిచిపెడుతున్నామన్నారు. ప్రతి నెల విద్యుత్ బిల్లులను తాను చెల్లిస్తున్నానని రసీదులు కూడా చూపించామని,

*** విద్యుత్ చౌర్యం అవాస్తవం * ఎంపీపీ డొక్కరి దానయ్య**



ఫోన్ పే కూడా కొన్ని విద్యుత్ బిల్లులు చెల్లించినట్లు ఆధారాలు వెల్లడించారు. తాను విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని టీడీపీ నేతలు అనడం తనపై బురదజల్లడమేనన్నారు. ఎంపీపీగా మండలానికి ఎంతో అభివృద్ధి చేశానని, నీతి, నిబద్ధత, తన వ్యక్తిత్వమని మండల ప్రజలకు తన గురించి తెలుసన్నారు. టీడీపీలో కూడా తన బంధువులు ఉన్నారని తన వ్యక్తిత్వం వాళ్లందరికీ తెలుసన్నారు. టీడీపీ నేతలు విమర్శలు, నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు మామిడి తులసయ్య, సార దుర్వాసులు, బహడపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉమాపతి, సరియాపల్లి సర్పంచ్ బత్తిని వెంకట్, సాలిన పాపారావు, కే లక్ష్మీనారాయణ, మట్ట కూర్మారావు, మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంచే విద్య అవసరం

### ఫోరం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్

**సోంపేట, జులై 21 (వార్త):** జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రాంతీయ సమావేశం సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. సమావేశంలో సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మందస జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమావేశంలో ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచే విద్య అవసరమన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఏపీబిఎస్‌టిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రమోద్ కుమార్ పాడి మాట్లాడుతూ ప్రస్తుతం ఆరు నుండి పదో తరగతి వరకు ఉన్న జీవశాస్త్ర పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా అదనపు సమాచారంతో విపులంగా బోధించి సమగ్రమైన అవగాహనను విద్యార్థులలో కల్పించాలని పిలుపునిచ్చారు. బిఎస్‌టిఎఫ్ రాష్ట్ర నాయకుడు, జన విజ్ఞాన వేదిక విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథానికి ప్రాతిపదిక అయినా చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని సిలబస్ నుండి తొల గించడం అశాస్త్రీయ భావనలకు కారణమవుతుందన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే పాఠ్యాంశాలను సిలబస్‌లో తిరిగి పొందుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవ శాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనను, దృక్పథాన్ని పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లా అకడమిక్ సెల్ నాయకులు మురళి దుల్లై, కోశాధికారి వి.త్రివిక్రమ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన కు అవసరమైన మెటీరియల్‌ను ఫోరం అందిస్తుందని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు గగన కుమారి, సహ కార్యదర్శి మంచు కవిత కుమారి మాట్లాడుతూ విద్యా విషయక అంశాల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఫోరం మరింత కృషిని పెంచేందుకుగాను జిల్లాలోని జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుల డైరీని నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ మండలాల నాయకులు చక్రధర్, జి ప్రకాష్ గోపాలకృష్ణ, అమర రవికుమార్, ప్రసాద్ తదితరులు భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించారు. సమావేశంలో ఒడియా ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దుర్గా ప్రసాద్ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరుకాగా, జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం సోంపేట నాయకులు జి.ప్రకాష్, బి చక్రధర్, ఇచ్ఛాపురం నాయకులు రవికుమార్, పి మోహన్ రావు, ఎం‌ఈశ్వరి, కవిటి నాయకులు పి ప్రసాద్ బాబు, గిరిబాబు, మందస నాయకులు దీనబంధు, సాంబమూర్తి, కంచిలి నాయకులు ఎస్ గోపాలకృష్ణ, టీ మన్మధరావుతో పాటు ఐదు మండలాల నుండి పెద్ద సంఖ్యలో జీవ శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## గంగమ్మకు జలహారతి

**గార, జులై 21 (వార్త):**సతివాడ గ్రామం వద్ద వంశధార కుడికాలువకు సాగునీరు వచ్చినందుకు గాను ఎమ్మెల్యే గొండు శంకర్, తదితరులు గంగమ్మకు జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో అధికారం ఇచ్చిన రైతులకు అండగా ఉంటామన్నారు. సంవత్సరాల తరబడి కాలువల్లో పూడిక తీయకపోవడం, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో శివారు భూములకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. రైతులు ఈ విషయాన్ని వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి నిధులు మంజూరు చేయడంతో వంశధార కాలువల్లో పూడికలు తీయించామని, దీనివల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## లైన్ సోయింగ్ విధానంలో వరినాట్లతో మేలు



**మందస, జులై 21 (వార్త):** వరినాట్లు వేసేటప్పుడు లైన్ సోయింగ్ (వరుస ప్రకారం నాట్లు వేయుట) విధానంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్చార్జి కె.లక్ష్మణరావు అన్నారు. చీపి పంచాయతీ బొందికరి వద్ద లైన్ సోయింగ్ విధానంలో వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ విధానంలో వరినాట్లు వేయడానికి రైతు వడ్డి గోపాల్ ముందుకు వచ్చారన్నారు. ప్రతీ ఒక్క రైతు వరినాట్లు వేసేటప్పుడు లైన్ సోయింగ్ పద్ధతి పాటించాలని కోరారు. దిగుబడి పెరగడమే కాకుండా చీడ, పీడలను కూడా నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి సవర బాలకృష్ణ, ఐసీఆర్పీ తులసమ్మ, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయం

* ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
* ఎంజీఆర్ ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం




**పాతపట్నం/ఎల్ఎన్‌పేట, జులై21(వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు అన్నారు. రానున్న మెగా డీఎస్సీ రానున్న దృష్ట్యా పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాలలో మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అత్యుత్తమ ఫ్యాకలిటీతో,అధునాతన సాంకేతిక పద్ధతులతో ఎంజీఆర్ ఉచిత మెగా డిఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కోచింగ్ సెంటర్‌కు విశేష స్పందన రావడంతో సుమారు 500మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిని ఉద్దేశించి ఎంజీఆర్ మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న డీఎస్సీలో జిల్లాలో అత్యధిక పోస్టులు పాతపట్నం నియోజకవర్గానికి రావాలని కోరారు. రానున్న రోజుల్లో వలసల నివారణకు ఇండస్ట్రీయల్ క్యారిడార్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 108 వాహనం తనిఖీ



**పలాస, జులై 21 (వార్త):** పలాస మండల కేంద్రంలో 108 వాహనం సేవలపై పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ రికార్డు డ్యూటీ చార్ట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన సేవలు అందించాలని అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది బి.తారకేశ్వరరావు, పి.తిరుపతిరావు, ఎన్.రాజారావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

# ఎర్ర చెరువు రోడ్డుపై దృష్టి సారించాలి

*** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు * 24, 31 వార్డుల్లో గుడ్ మార్నింగ్**



**పలాస, జులై 21(వార్త):** పలాస ఎర్ర చెరువు రోడ్డుపై దృష్టి సాధించాలని, రోడ్డుకు ఇరువైపులా ఏపుగా మొక్కలు పెరిగిపోవడంతో నిత్యం అటువైపుగా ప్రయాణిస్తున్న వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. పలాస 24, 31 వార్డుల్లో ఆదివారం గుడ్ మార్నింగ్‌లో భాగంగా పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు ఆయా వార్డుల్లో వజ్జ బాబూరావుతో పాటు ఆయా ప్రాంత వార్డు ప్రజలు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర చెరువు రోడ్డుపై గోతులు, కాలువపై పలకలు పాడయ్యాని తక్షణమే బాగు చేయాలని కోరారు. వార్డుల్లో పరిశీలించిన సమస్యలను ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్‌కు దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సప్పు నవీన్, సప్పు చిరంజీవులు, కొరికాన శంకరరావు, అంబటి కృష్ణమూర్తి, యాల్ల బుడ్డు, దడియాల నర్సింహులు, కొరికాన వైకుంఠ, దాసరి విజయ్ పాల్గొన్నారు.

## ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్షకు 72 మంది హాజరు

పలాస మదర్ థెరీసా పాఠశాలలో కింజరాపు ఎర్రన్నాయుడు జ్ఞాపకార్థం ఆయన తనయుడు కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఎర్రన్న విద్యా సంకల్పంలో బాగంగా నిర్వహించిన పరీక్షలకు 72 మంది హాజరైనట్లు పాఠశాల చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని తెలిపారు. 140 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 72 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను వజ్జ బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వజ్జ బాబూరావు మాట్లాడుతూ నిరుద్యోగులు ఎప్పటికప్పుడు రాయబోవు కాంపిటీటివ్ ఎగ్జామినేషన్‌పై అవగాహన కల్పించేందుకు, వారిని ప్రోత్సహిస్తూ, ఎగ్జామినేషన్‌లో మెరిట్ సాధించిన వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటరులుగా ఆర్ ప్రసాదరావు, కూర్మారావు, జోగారావు, చిరంజీవి, శశిరేఖ వ్యవహరించారు.



## వంద రోజులు పని కల్పించండి

**నరసన్నపేట/జలుమూరు, జులై 21 (వార్త):** నియోజకవర్గంలో ప్రతీ పేద కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో ఆయన జిల్లా స్థాయి ఉపాధి హామీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సాగునీటి కాలువలు, చెరువులు, మట్టి రహదారి పనులు, పశువుల షెడ్లు, సిమ్మెంటు రహదారులు నిర్మాణం చేపట్టాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకుడు జీవీ చిట్టి రాజు, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన ఏపివోలు, జెఈలు పాల్గొన్నారు. నరసన్నపేటలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు.

## జ్వరంతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



**ఇచ్ఛాపురం, జులై 21(వార్త):** స్థానిక బెల్లుపడకి చెందిన తిప్పన విగ్నేష్‌రెడ్డి(21) తీవ్ర జ్వరంతో బాధ పడుతూ ప్లేట్‌లెట్‌లు తగ్గిపోవడంతో మృతి చెందాడు. తండ్రి రమణా రెడ్డి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. ప్రస్తుతం ఈ కుటుంబం దానంపేటలో ఉంటుంది. విశాఖపట్నంలో బీటెక్ చదువుతున్న విగ్నేష్ అక్కడే ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి ఇచ్ఛాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. విగ్నేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## క్రీడా విధానాలపై అవగాహన పెంచుకోవాలి



**పలాస, జులై 21(వార్త):** మారిన క్రీడా విధానాలపై అవగాహన పెంచుకోవాలని టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.తవిటయ్య చెప్పారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మొదటి జోన్ వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. దీనికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఆయన క్రీడా నియమ నిబంధనలపై అవగాహన కలిగించారు. సెప్టెంబర్‌లో జరగనున్న పాఠశాల క్రీడల సమాఖ్య పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మొదటి జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యదర్శి పి.గజేంద్ర, వివిధ మండలాల క్రీడా నిర్వాహకులు సీహెచ్ పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, పండా, కార్తికేయ చౌదరి, పి.కృష్ణ, ఎస్.వి.జోగారావు తదితరులు పాల్గొన్నారు. శిక్షకులు కె.రామారావు, బి.తిరుమల, దామోదర్ సన్మానించారు. కార్యక్రమంలో జోన్‌లోని వివిధ పాఠశాలల వ్యాయామవిద్య ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వర్షాలకు పాడైన రోడ్లు

**నరసన్నపేట/జలుమురు, జులై 21 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో ప్రధాన హైవే, ఇతర రహదారులు గత రెండు రోజులు కురిసిన వర్షాలకు దారుణంగా మారాయి. తిలారు ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా నిర్మించిన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణమంటే హడలిపోతున్నారు. తక్షణం తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



## జ్ఞాన సరస్వతి అవార్డుకి కృష్ణారెడ్డి

**ఇచ్ఛాపురం, జులై 21(వార్త):** తెలంగాణ బోనాల ఉత్సవాలలో భాగంగా జ్ఞాన సరస్వతి అవార్డుకు ఇచ్ఛాపురంనకు చెందిన కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. నృత్యమాల నాట్యకళ వెల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరి ఆర్ట్ అకాడమీ నిర్వహణలో బోనాల ఉత్సవాలు సందర్భంగా ఆల్ ఇండియా లెవెల్ డాన్స్ ఫెస్టివల్ 2024 హైదరాబాద్ రవీంద్రభారతి వేదికపై నిర్వహిస్తున్నారు. నాట్యమయూరి, జ్ఞాన సరస్వతి అవార్డులు 2024 కార్యక్రమం లో కూచిపూడి, భరతనాట్యం, జానపదం, ఆంధ్ర నాట్యం, సంగీతం వివిధ కళలలో పాల్గొన్న కళాకారులు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యారు.

## నిరుపేదకు స్పందన సాయం



**సంతబొమ్మాళి, జులై 21(వార్త):** సంతబొమ్మాళి మండలం బడే కుప్పన్న పేట కేంద్రంగా పనిచేస్తున్న కేపీ స్పందన ఫౌండేషన్ ఆదివారం టెక్కలి గొల్ల వీధి కి చెందిన నిరుపేద బర్ల కృష్ణకు ఒక నెలకు సరిపడా 25 కేజీ ల బియ్యం తో పాటు 25రకాల సామగ్రిని అందించారు కృష్ణ బతుకు తెరువుకోసం హైదరాబాద్‌లో కొంత కాలం పనులు చేసి అక్కడ అనారోగ్యం బారిన పడి స్వగ్రామం చేరుకున్నాడు. పూర్తిగా ఇల్లు కదలలేని అతను తన ఇల్లు గడవడం కష్టంగా అనిపించింది. తన ఆకలి తీర్చమని స్పందన ఫౌండేషన్‌ను వేడుకోగా సభ్యులు వెళ్లి నెలకు సరిపడా ఆహార పదార్థాలు, మందుల ఖర్చు కోసం 15వందల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో షణ్ముఖ మాస్టర్, సిమ్మన్న, శివారెడ్డి, సింహాచలం పాల్గొన్నారు.

## హరహర ఓం చిత్రాన్ని ఆదరించండి

*** విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత రామ్‌మోహన్‌రెడ్డి**
*** వమ్మరవల్లిలో తొలిషాట్ చిత్రీకరణ**

**గార, జులై 21 (వార్త):** రైతు సమస్యలకు పరిష్కారం చూపుతూ అవినీతి రాజకీయ నాయకుల భరతం పట్టే కథతో కుడోస్ క్రియేషన్స్ బేనర్‌పై యార్లగడ్డ దర్శకత్వంలో నిర్మిస్తున్న హరహర ఓం చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించి గొప్ప విజయాన్ని అందించాలని చిత్ర నిర్మాత రామ్‌మోహన్‌రెడ్డి కోరారు. గార మండలం వమ్మరవల్లిలో దానప్ప దేవాలయంలో చిత్ర యూనిట్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే తొలిషాట్‌ను చిత్రీకరించారు. ఈ సన్నివేశానికి సర్పంచ్ గంటా రఘునాథరెడ్డి క్లాప్ కొట్టి మొదటి సన్నివేశాన్ని ఆవిష్కరించారు. ప్రొడ్యూసర్ రామ్ మోహన్ రెడ్డి గంటా మాట్లాడుతూ తన విజయంలో ప్రతిసారి దానప్ప దేవుడు తోడు ఉన్నాడన్నారు. ఈ హర హర ఓం సినిమా కూడా తోడు ఉంటాడని నమ్మకంతో ఉన్నానని తెలిపారు. సీనియర్, జూనియర్ నటులతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. తాను అమెరికాలో స్థిరపడినప్పటికీ తనలో తెలుగునేల భావాలు అనువణువునా నిండి ఉన్నాయన్నారు. సమావేశంలో డైరెక్టర్ నందు యార్లగడ్డ, యూజిక్ డైరెక్టర్ యమ్. యల్. రాజా, నటినటులు తరుణ్ తేజ్, ఆధ్యశ్రీ, శ్రీజ, కెమెరామెన్లు ఉదయ్, జె భాస్కర్, అసిస్టెంట్ అనిల్ రెడ్డి, నగేష్, రామస్వామి, సంజాయ్, శ్రీనివాస్ రెడ్డి, తెజో, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మధురెడ్డి, వేణుగోపాల్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.



## ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

**నరసన్నపేట/జలుమూరు, జులై 21 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వావిలిపల్లి నారాయణస్వామి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌ను దుశ్శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధునాతన సౌకర్యాలతో మహాప్రస్థానం నిర్మాణం

ఇచ్ఛాపురం, జులై 21(వార్త):స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వల్లభ రాయ గెడ్డ శ్మశాన వాటిక అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకోనుంది. శ్మశానవాటిక మహాప్రస్థానం భవన నిర్మాణ ప్రణాళిక 3డి విజువల్స్ విడుదల చేశారు. ప్రస్తుత ఉన్న నిర్మాణం, వేచి ఉండు ప్రదేశం, బూడిద భద్రతా లాకర్ గది, సాంప్రదాయ దహన బ్లాక్ తదితర అంశాలపై రోటరీ క్లబ్ సభ్యులు చర్చించారు. వైస్ చైర్‌పర్సన్ ఉళాల భారతి దివ్య, పట్టణ కౌన్సిలర్లు ఆసి లీలారాణి, బచ్చు జగన్, పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్ యాదవ్, మధు, లోకేశ్, తిరుపతి, ప్రకాశ్ పట్నాయక్, సిహెచ్ జగన్, కాళ్ల ధర్మారావు, నీలాపు ఢిల్లీ, గువ్వడా ప్రదీప్ కుమార్, నారాయణ బెహేరా తదితరులు పాల్గొని సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ పెడిశెట్టి దినేష్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ వేదవ్యాస, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కూలిన మహా వృక్షం

**శ్రీకాకుళం టౌన్, జులై 21(వార్త):** శ్రీకాకుళం నగరం లోని కొత్తపేట గ్రామ శివారు ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు రెండు వందల సంవత్సరాల నాటి క్రితం మహా వృక్షం మర్రి చెట్టు నేలకొరిగింది. మర్రి చెట్టు ప్రజలు, వాహనాలు నడిచే రోడ్డుమార్గం పైన, విద్యుత్ తీగలపైన పడక పోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే మర్రి చెట్టు కింద ఉన్న ఇసుక బండి నేలమట్టమైంది.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## లయన్.డా.మిశ్రోకు సన్మానం

**ఎల్ఎన్‌పేట, జులై21 (వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, లయన్.డా.ఎం.కె.మిశ్రోను గురుపౌర్ణమి సందర్భంగా జిల్లా టెలికాం సలహా మండలి సభ్యుడు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వాన సోమేశ్వరరావు, రవీంద్ర పాణిగ్రాహి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణ చంద్ర మహపాత్రో, రామారావు పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



**గార, జులై21 (వార్త):** గురుపౌర్ణమి వేడుకలను కళింగపట్నం పంచాయతీ తాన్సాహెబ్ పేటలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి మందిరంలో భక్తులు క్షీరాభిషేకం, పూజలు చేశారు. మధ్యాహ్నం మందిరం ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పొట్నూరు కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు ఎర్రన్న రెడ్డి, గుడ్ల రామకృష్ణ, అనురాధ, సుభాషిని పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరిదేవీ పీఠంలో వ్యాస పూర్ణిమ

**మెళియాపుట్టి, జులై21 (వార్త):** చాపర గ్రామంలోని రాజరాజేశ్వరిదేవి పీఠంలో వనమాలి వెంకటరమణమూర్తి శర్మ సోదరుల నేతృత్వంలో ఆదివారం వ్యాస పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. వేదమూర్తులు రేజేటి నీలకంఠం సత్యనారాయణమూర్తి శర్మ, నాగమణి దంపతులకు సన్మానించారు. అలాగే మెళియాపుట్టి మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ.. బాబాను దర్శించుకుని పూజలు చేశారు.



## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

**ఇచ్ఛాపురం, జులై 21 (వార్త):** పురుషోత్తపురం పుష్పగిరి కొండపై గల షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. శివాజీ బాగల్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. తిరువీధి, అన్నదానం కార్యక్రమం జరిగింది. స్వేచ్ఛవతి ఆలయంలో గల బాబా ఉపాలయం, బలరాం పేట బాబా మందిరంలో పూజలు జరిగాయి.



షిరిడి సాయి ఆలయ పునః ప్రతిష్ట



## గురు సత్కారం సత్సంప్రదాయం

**శ్రీకాకుళం టౌన్, జులై21(వార్త):** విద్యనేర్పిన గురువును సత్కరించుకోవడం సత్సంప్రదాయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకంటే గురువు స్థానం గొప్పదన్నారు. శ్రీ తరణి క్రిష్ణ స్మారక ధార్మిక సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కళా మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని కళాప్రవీణ బండారు చిట్టిబాబును ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వివిధ డివిజన్ల ఇంచార్జిలు, నిర్వాహకులు, కళాభిమానులు పాల్గొన్నారు. అలాగే సింగుపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటి ఆహ్వానం మేరకు షిర్డీనాధుని ఆలయానికి విచ్చేసి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఏపీహెచ్‌బీ కాలనీలో గురుపౌర్ణమి వేడుకలు

నగరంలోని 31వ డివిజన్ పరిధిలో ఏపిహెచ్‌బి కాలనీలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్వామి పరాత్మానంద సరస్వతి విశ్వ గురువు శ్రీకృష్ణున్ని ప్రత్యేకంగా పూజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటిని పారద్రోలేవారు గురువులు అని, అలాంటి గురువులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జంగమ సాధికారిక డైరక్టర్ విభూతి సూరిబాబు, బీజేపీ నాయకురాలు శవ్వాన ఉమామహేశ్వరి, పిండి యోగేశ్వరరావు, శవ్వాన వెంకటేశ్వరరావు, బాలవిహార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### 40వ బూత్‌లో గురుపూజోత్సవం

గురుపూర్ణిమ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని 40వ బూత్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ సురేష్ బాబు సింగ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. వేద పండితులు మేడూరి వెంకట నరసింగరావు దంపతులకు పాద పూజ చేసి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, మహారాణా ప్రతాప్ సింగ్ హైందవ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## వాసుదేవుని సన్నిధిలో గురుపూర్ణిమ వేడుకలు

**మందస, జులై 21 (వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవుస్వామి ఆలయంలో గురుపూర్ణిమ వేడుకలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో అర్చకులు సచ్చిదానందపాడి, ఘనశ్యాం తదితరులు గురు పాదుకలకు అర్చన, క్షీరాభిషేకం కావించారు. అనంతరం దాసుకూర్మాచార్యులు గురుపౌర్ణిమ ప్రాశస్త్యాన్ని వివరించారు.






### బాబా నామస్మరణతో మార్మోగిన మందస

మందస పట్టణంలోని శ్రీషిరిడిసాయి ధ్యానమందిరంలో గురుపూర్ణిమ వేడుకలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గిన్ని తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్మా జోస్యుల సీతారామశర్మ మంత్రోచ్ఛారణలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మికతను నింపింది. శిరిడీ బాబా తిరువీధి మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. గిన్ని తిరుపతిరెడ్డితోపాటు ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, భక్తులు మందస పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### వ్యాసమహర్షికి పూజలు

**కొత్తూరు, జులై 21 (వార్త):** కొత్తూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వ్యాస మహర్షికి ఆలయ అర్చకులు కృష్ణమాచారి పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ధర్మకర్త పొగిరి రవి, భక్తులు పాల్గొన్నారు.




## సారవకోటలో సత్సంగ ప్రవచనాలు

**సారవకోట/జలుమూరు, జులై 21 (వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామంలో ఆదివారం గు రుపౌర్ణమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి పీఠంలో సత్సంగ ప్రవచనాలు నిర్వహించారు. గురు పౌర్ణమి విశిష్టతను వివరించారు. గ్రామస్థులు, స్థానిక యువత పాల్గొన్నారు.

### నీలమణి దేవికి అన్నం నైవేద్యం


అవలంగి గ్రామంలో కొలువైన నీలమణి దేవికి ఆదివారం రెండు కింటాళ్ల బియ్యంతో తయారు చేసిన అన్నాన్ని నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. ప్రతి ఏడాది పౌర్ణమి రోజులు సంప్రదాయం ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అర్చకులు చల్లపల్లి తెలిపారు.



**సంతబొమ్మాళి, జులై 21 (వార్త):** నౌపడ గ్రామంలో గురు పౌర్ణమి సందర్భంగా శిరిడి సాయిబాబా మందిరం పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. షిరిడి సాయిబాబా మందిరంలో ఉదయం 5 గంటలకు కాగడ హారతి అభిషేకములు మండల మండప హోమమం పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పల్లకి సేవ, శోభాయాత్ర, ఊరేగింపు నిర్వహించారు. భజన కార్యక్రమం తో పాటు మహారథి పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు మక్క లవకుమార్ రెడ్డి దంపతులచే నిర్వహించారు.


### ఘనంగా గురుపౌర్ణమి పూజలు

**ఎల్ఎన్‌పేట, జులై21(వార్త):** గురుపౌర్ణమి పురష్కరించుకొని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని షిర్డీ పర్తి సాయి మందిరంలో పూజ, భజన, అన్న ప్రసాద కార్యక్రమాలను గ్రామస్థులు, సాయి భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో షన్ముఖరావు, పాండురంగనాధరాజు, మనోజ్, కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.



## పోటెత్తిన ఆదిత్యుని ఆలయం

**అరసవల్లి, జులై 21 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. సూర్యనారాయణ స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.57,300, పూజలు, విరాళాల రూపంలో రూ.73,813, ప్రసాదాల రూపంలో రూ.1,40,724లు ఆదాయం వచ్చిందని ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.లావేరు వాస్తవ్యులు డి.లక్ష్మణ్‌రావు, ఆదిలక్ష్మి, నాగమణి శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం లక్ష రూపాయల చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. విశాఖ పట్నం ఏఎస్పీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్న కుమార్ కుటుంబసమేతంగా దేవాలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413